www.aksharadarbar.com
మంగళవారం 14, మే 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :86 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

అందరి సహకారంతో ప్రశాంతంగా పోలింగ్

- వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో 68.86 శాతం ఓటింగ్ నమోదు
- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

04

పోస్టుమార్టం

- పోలింగ్ పై లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు
- బూత్ ల వారీగా కూడికలు తీసివేతలు
- గెలుపుపై జోరుగా బెట్టింగ్
- ఫలితాలు వెలువడే వరకు ఉత్కంఠే

మండుటెండలో జోరుగా ప్రచారం చేసిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికలపై పోస్టుమార్టం చేస్తున్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పరిశీలన మొదలుపెట్టారు. ఏ శాసనసభ నియోజకవర్గంలో ఎంత పోలింగ్ నమోదైంది, పోలింగ్ శాతం తమకు అనుకూలమా, ప్రతికూలమా అని బేరీజు వేసుకుంటున్నారు. ఆయా సెగ్మెంట్ ముఖ్యనేతలతో చర్చలు జరుపుతున్నారు. ఏ బూతులో ఎంత ఓటింగ్ శాతం నమోదైంది.. ఆ బూతు పరిధిలో తమ బలాబలాలు ఏంటని లెక్కలేసుకుంటున్న పరిస్థితి. బరిలో నిలిచిన వారు ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో నువ్వానేనా అన్నట్లు పోటీ ఉండటంతో లోతుగా విశ్లేషిస్తున్నారు. ఏ ప్రాంతంలో ఎలా క్యాంపెయిన్ చేశాము, ప్రత్యర్థులు ఎలా ప్రచారం నిర్వహించారో చర్చించుకుంటూ కూడికలు తీసివేతలు చేసుకుంటున్నారు. ప్రచారంలో ఎంత ఖర్చు చేశాము, ఎక్కడెక్కడ ఎంత వ్యయం అయిందో లెక్కలు చూసుకునే బిజీలో నేతలు ఉన్నారు.

04

–అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

రూ. 662 కోట్లతో ఫోర్ లైన్

గూడప్పాడ్ టూ చెల్పూర్ వరకు హైవే విస్తరణ

- 42 కిమీ పనులు చేపట్టేందుకు పచ్చజెండా
- చలివాగు, మోరంచ వాగులపై కొత్త వంతెనలు
- టెండర్ పిలిచేందుకు ఎన్ హెచ్ కసరత్తు
- కోడ్ ముగియగానే షురూ కానున్న ప్రక్రియ
- భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్ చొరవ

వాహనదారులకు తీపి కబురు. 363సీ జాతీయ రహదారిని ఫోర్ లైన్ గా విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆత్మకూరు మండలం గూడప్పాడ్ నుంచి పరకాల, రేగొండ, గాంధీనగర్ మీదుగా గణపురం మండలంలోని చెల్పూర్ వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మించేందుకు ఇటీవల రూ.662 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో సుమారు 42 కిలోమీటర్లు రెండు వైపులా 9 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు, డ్రెయిన్లు, ఫుట్ పాత్ లు, మధ్యలో మీటరున్నర వెడల్పుతో డివైడర్, పరకాల వద్ద చలివాగుపై, చెల్పూర్ వద్ద మోరంచ వాగుపై ప్రస్తుతం ఉన్న వంతెనలకు తోడు కొత్తగా అదనపు వంతెనల నిర్మాణం జరగనుంది. ఈ పనులు చేపట్టేందుకు జాతీయ రహదారుల (ఎన్ హెచ్) విభాగం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే రూ.662 కోట్లతో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఈ ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు.

02

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

పల్లెల్లో ఓటర్ల చైతన్యం

03

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనే నగరాల కంటే ఎక్కువగా పోలింగ్ నమోదైంది. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన నియోజకవర్గాల్లో ఓటింగ్ సాయంత్రం నాలుగు గంటలకే ముగించినా మెరుగ్గా ఓటింగ్ శాతం రికార్డ్ అయింది. రాష్ట్రంలోని భువనగిరి 76.47, ఖమ్మం 75.19 అధిక ఓటింగ్ శాతంతో తెలంగాణలో టాప్ లో నిలిచాయి. సికింద్రాబాద్ 48.11, హైదరాబాద్ 46.08 అత్యల్ప ఓటింగ్ శాతంతో చివర్లో ఉన్నాయి.

– అక్షర దర్బార్, హైదరాబాద్

- గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక పోలింగ్ నమోదు
- భారీగా ఓటు హక్కు వినియోగించుకున్న ఏజెన్సీ వాసులు
- నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో అత్యధిక పోలింగ్
- పట్టణాలు, నగరాల్లో పోలింగ్ పట్ల ఓటర్ల అనాసక్తి
- మలక్ పేట శాసనసభ నియోజకవర్గంలో అత్యల్పం

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

గూడెప్పాడ్ టు చెల్పూర్

ఫోర్ లైన్

రూ.662 కోట్లతో హైవే విస్తరణ పనులు

- 42 కి.మీ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పచ్చజెండా
- చలివాగు, మోరంచ వాగులపై కొత్త వంతెనలు
- టెండర్ పిలిచేందుకు కసరత్తు
- కోడ్ ముగియగానే షురూ కానున్న ప్రక్రియ
- ఫలించిన భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్ చొరవ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

వాహనదారులకు తీపి కబురు. 363సీ జాతీయ రహదారిని ఫోర్ లేన్ గా విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ నుంచి పరకాల, రేగొండ, గాంధీనగర్ మీదుగా గణపురం మండలంలోని చెల్పూర్ వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మించేందుకు ఇటీవల రూ.662 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో సుమారు 42 కిలోమీటర్లు రెండు వైపులా 9 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు, డ్రెయిన్లు, ఫుట్ ఫాత్ లు, మధ్యలో మీటరున్నర వెడల్పుతో డివైడర్, పరకాల వద్ద చలివాగుపై, చెల్పూర్ వద్ద మోరంచ వాగుపై ప్రస్తుతం ఉన్న వంతెనలకు తోడు కొత్తగా అదనపు వంతెనల నిర్మాణం జరగనుంది.

ఈ పనులు చేపట్టేందుకు జాతీయ రహదారుల (ఎన్ హెచ్) విభాగం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే రూ.662 కోట్లతో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఈ ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు.

పెరిగిన రాకపోకలు

హైదరాబాద్ – భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో ఆత్మకూరు మండలంలోని గుడప్పాడు వద్ద 353సీ జాతీయ రహదారి ప్రారంభం అవుతుంది. గుడప్పాడ్ నుంచి మాందారిపేట, పరకాల, రేగొండ, చెల్పూర్, భూపాలపల్లి, కాటారం, మహాదేవపూర్, కాళేశ్వరం మీదుగా మహారాష్ట్రలోని సిరొంచవరకు ఈ జాతీయ రహదారి ఉంది. భూపాలపల్లి సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి అవుతున్న కోల్ రోడ్డు మార్గంలో లారీల ద్వారా ఇదే రహదారి మీదుగా రవాణా జరుగుతుంది. కాళేశ్వరం, మహాదేవపూర్ ప్రాంతాల్లో ఉన్న ఇసుక క్వారీల నుంచి లారీల ద్వారా ఈ రహదారి మీదుగానే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు గోదావరి ఇసుక రవాణా సాగుతుంది. మానేరుతో పాటు ఇతర వాగుల ఇసుక కూడా ఇదే జాతీయ రహదారి మీదుగా లారీల్లో తరలిపోతుంది. వీటికి తోడు చెల్పూర్ వద్ద జెన్ కోకు చెందిన కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ)ఉంది. భూపాలపల్లి ప్రాంతంలోని బొగ్గు గనుల నుంచి ఈ కేటీపీపీకి రోడ్డు మార్గంలోనే లారీల ద్వారా బొగ్గు రవాణా జరుగుతుంది. అంతేకాదు ఈ కేటీపీపీ నుంచి వెలువడే బూడిద కూడా లారీల ద్వారా ఈ జాతీయ రహదారి మీదుగానే రవాణా జరుగుతున్న పరిస్థితి. దీంతో ఈ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. భూపాలపల్లి కేంద్రంగా 2016లో కొత్త జిల్లా కూడా ఆవిర్భవించడంతో ఈ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల సంఖ్య రోజురోజుకీ గణనీయంగా పెరిగిపోతుంది. ఫలితంగా ప్రస్తుతం పది మీటర్ల వెడల్పుతో ఉన్న డబుల్ రోడ్డు సరిపోవటం లేదు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చెల్పూర్ జెన్ కో నుంచి గూడెప్పాడ్ వరకు ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం కోసం చొరవ తీసుకుని సఫలీకృతం అయ్యారు. సుమారు 42 కిలోమీటర్ల ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల రూ.662 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

చేపట్టనున్న పనులు ఇవే

గూడెప్పాడ్ నుంచి చెల్పూర్ జెన్ కో వరకు సుమారు 42 కిలోమీటర్ల ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం ఉన్న వంద అడుగుల రహదారిలోనే మధ్యలో మీటరున్నర వెడల్పుతో డివైడర్, డివైడర్ కు రెండువైపులా తొమ్మిది మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డుతో పాటు డ్రెయిన్లు నిర్మిస్తారు. రోడ్డుపై ఉన్న గ్రామాల వద్ద డ్రెయిన్ తోపాటు పుట్ ఫాత్ లను కూడా నిర్మిస్తారు. పరకాల వద్ద గల చలివాగుపై ప్రస్తుతం 8 మీటర్ల వెడల్పుతో వంతెన ఉంది. ఇక్కడ దీని పక్కన కొత్తగా పదమూడున్నర మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మాణం జరగనుంది. అలాగే చెల్పూర్ వద్ద గల మోరంచ వాగుపైనా ప్రస్తుతం ఉన్న వంతెన పక్కన కొత్తగా మరో వంతెన పదమూడున్నర మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. పరకాల వద్ద ఉన్న మొండివాగుతో పాటు మరికొన్ని చోట్ల కూడా మైనర్ వంతెనలు నిర్మాణం జరగనుంది. ఫోర్ లేన్ నిర్మాణంతో ఈ రోడ్డు సుమారు రెండు అడుగుల ఎత్తు లేవనుంది.

త్వరలో టెండర్

నిర్మాణ పనులు చేపట్టడానికి త్వరలో రూ.662 కోట్లతో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు ఎన్ హెచ్ విభాగం అధికారులు సమాయత్తం అవుతున్నారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున ఈ కోడ్ ముగియగానే టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు ప్రారంభమైనప్పటి నుంచి రెండేళ్ల కాల పరిమితితో 42 కిలోమీటర్ల ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది. ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణంతో ఈ జాతీయ రహదారిపై వాహనదారుల కష్టాలు తీరే అవకాశం ఉంది.

వైభవంగా శ్రీ దత్తాత్రేయ

ఆలయ వార్షికోత్సవం

పాల్గొన్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు

అక్షర దర్బార్, మల్హర్ : కాటారం మండంలోని దన్వాడలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణ రావు, మక్కాన్ సింగ్, ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలకు మంత్రి శ్రీధర్ బాబు స్వామి వారి శేష వస్త్రాలు అందజేసి సన్మానించారు.

డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన దుద్దిల్ల శ్రీను బాబు

శ్రీ దత్తాత్రేయ, శివపార్వతి, గణపతి, ఆధిత్య నందికేశ్వర భక్తాంజనేయ ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను దుద్దిళ్ల శ్రీనుబాబు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.

పూజల్లో పాల్గొన్న మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు

నేడే టీఎస్ సీపీగేట్

నోటిఫికేషన్

వెల్లడించిన టీఎస్ సీపీగేట్ కన్వీనర్

అక్షర దర్బార్, హైదరాబాద్ : టీఎస్ సీపీగేట్ 2024 నోటిఫికేషన్ ఉన్నత విద్య శాఖ మండలి కాన్ఫిరెన్స్ హల్ లో విద్య శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం బుధవారం విడుదల చేయనున్నట్టు టీఎస్ సీపీగేట్ 2024కన్వీనర్ ప్రో .ఐ పాండురంగా రెడ్డి వెల్లడించారు . టీఎస్ సీపీగేట్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ఏం.ఏ .ఏంఎస్సి .ఏంకామ్ .ఎం .ఈడీ.ఎం .పీఈడీ కోర్సుల్లో ప్రవేశము కోసం ఈ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని తెలిపారు . ఈ కోర్సులు ఉస్మానియా , కాకతీయ , శాతవాహన తెలంగాణ, మహాత్మా గాంధీ , పాలమూరు , తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంతో పాటు జె ఎన్ టి యూ లో కుడా ఈ కోర్సులను అందిస్తారని పేర్కొన్నారు .

- గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక పోలింగ్ నమోదు
- భారీగా ఓటు హక్కు వినియోగించుకున్న ఏజెన్సీ వాసులు
- నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో అత్యధిక పోలింగ్
- పట్టణాలు, నగరాల్లో పోలింగ్ పట్ల ఓటర్ల అనాసక్తి
- మలక్ పేట శాసనసభ నియోజకవర్గంలో అత్యల్పం

పల్లెల్లో ఓటర్ల చైతన్యం

అక్షర దర్బార్, హైదరాబాద్: నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనే నగరాల కంటే ఎక్కువగా పోలింగ్ నమోదైంది. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన నియోజకవర్గాల్లో ఓటింగ్ సాయంత్రం నాలుగు గంటలకే ముగించినా మెరుగ్గా ఓటింగ్ శాతం రికార్డ్ అయింది. సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన ప్రాంతాలతో పోలిస్తే బెటర్ గా ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని భువనగిరి 76.47, ఖమ్మం 75.19 అధిక ఓటింగ్ శాతంతో తెలంగాణలో టాప్ లో నిలిచాయి. సికింద్రాబాద్ 48.11, హైదరాబాద్ 46.08 అత్యల్ప ఓటింగ్ శాతంతో చివర్లో ఉన్నాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పరిశీలిస్తే హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని మలక్ పేట అసెంబ్లీ సెగ్మెంట్ లో అత్యల్పంగా 38.3 శాతం పోలింగ్ నమోదైంది. మెదక్ లోకసభ నియోజకవర్గంలోని నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో 83.73 శాతం ఓటింగ్ రికార్డు అయింది. మొత్తంగా తెలంగాణలోని 17 లోకసభ నియోజకవర్గాల్లో 64.93 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మహానగరంలో ముందుకు రాలేదు

హైదరాబాద్ మహానగరంలో ప్రజలు ఓట్లు వేయడానికి అంతగా ఆసక్తి చూపలేదని ఓటింగ్ శాతాన్ని బట్టి తెలుస్తోంది. తెలంగాణలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో అత్యల్పంగా హైదరాబాద్ లో 46.08 శాతం, ఆ తర్వాత స్థానం సికింద్రాబాద్ 48.11శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. భువనగిరి 76.47శాతంతో టాప్ ప్లేస్ లో ఉండగా ఆ తర్వాత స్థానాన్ని ఖమ్మం 75.19 శాతంతో దక్కించుకుంది. వరంగల్ లో 68.29, మహబూబాబాద్ 70.68 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల కన్నా నగరవాసులు ఓటు వేయడానికి అంతగా ఆస్తకి చూపలేదు. ఓటింగ్ శాతం పెంచడానికి ఎన్నికల అధికారులు వివిధ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించినంతగా పోలింగ్ జరగలేదని ఎన్నికల సిబ్బంది చెపుతున్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా

రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని 119 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటింగ్ సరళిని పరిశీలిస్తే హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మలక్ పేట్ అసెంబ్లీ సెగ్మెంట్ లో 38.3 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. యాకుత్ పుర అసెంబ్లీ సెగ్మెంట్ లో 42.7 శాతం, సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ లో 45.37 శాతం, ముషిరాబాద్ లో 45.25, మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని కూకట్ పల్లి సెగ్మెంట్ లో 47.32, ఉప్పల్ లో 47.91, లాల్ బహదూర్ నగర్ 46.11 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది. మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో 83.73 అత్యధిక శాతం నమోదై రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో భువనగిరి పరిధిలోని మునుగోడు సెగ్మెంట్ లో 83.51, ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ లో 83.3, భువనగిరి పరిధిలోని భువనగిరి సెగ్మెంట్ లో 81.74, ఆలేరు లో82.52, మెదక్ లోకసభ నియోజకవర్గంలోని దుబ్బాక సెగ్మెంట్ లో 80.22 శాతం పోలింగ్ జరిగింది.

సమస్యాత్మక ప్రాంతాల్లో..

రాష్ట్రంలోని 5 పార్లమెంటు నియోజవర్గాల పరిధిలోని 13అసెంబ్లీ సెగ్మెంట్లను సమస్యాత్మక ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఇక్కడ పోలింగ్ ను సాయంత్రం 4గంటలకే ముగించారు. అయినా మెరుగ్గానే పోలింగ్ జరిగిందని చెప్పుకోవచ్చు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని మంథనిలో 70.08, చెన్నూరు లో 68.53, బెల్లంపల్లి లో 70.96, మంచిర్యాల లో 60.84, వరంగల్ పరిధిలోని భూపాలపల్లి లో 67.5, మహబూబాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని ములుగు 68.2, పినపాక 66, ఇల్లందు 70.55, భద్రాచలం 68.85, ఖమ్మం పరిధిలోని కొత్తగూడెం 66.17, అశ్వరావుపేట 80.36, అదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని సిర్పూర్ 70.08, అసిఫాబాద్ 75.09 శాతం ఓటింగ్ జరిగింది.

వరంగల్ లోకసభ నియోజకవర్గం పరిధిలోని స్టేషన్ ఘనపూర్ సెగ్మెంట్ లో 78.04, పాలకుర్తి 70.85, పరకాల 76.86, వరంగల్ పశ్చిమ 52.67, వరంగల్ తూర్పు 63.5, వర్ధన్నపేట71.4, భూపాలపల్లి 67.5 శాతం పోలింగ్ జరిగింది. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని డోర్నకల్ 74.38, మహబూబాబాద్ 70.13, నర్సంపేట 75.6, ములుగు 68.2, పినపాక 66, ఇల్లందు 70.55, భద్రాచలంలో 68.85 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాష్ట్రంలోని 17లోకసభ నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన ఎన్నికల ఓటింగ్ శాతం

అదిలాబాద్	72.96
పెద్దపల్లి	67.88
కరీంనగర్	72.33
నిజామాబాద్	71.50
జహీరాబాద్	74.54
మెదక్	74.38
మల్కాజిగిరి	50.12
సికింద్రాబాద్	48.11
హైదరాబాద్	46.08
చేవెళ్ల	55.45
మహబూబ్ నగర్	71.54
నాగర్ కర్నూల్	68.86
నల్గొండ	73.78
భువనగిరి	76.47
వరంగల్	68.29
మహబూబాబాద్	70.68
ఖమ్మం	75.19

మంత్రాల నెపంతో దంపతులపై దాడి

అక్షర దర్బార్, మహబూబాబాద్: ఆధునిక ప్రపంచంలో జనాల్లో మూఢ నమ్మకాలు మాత్రం పోవడం లేదు. లేనిపోని అనుమానాలతో నేరాలకు పాల్పడుతున్నారు. మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దంపతులపై దాడి చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామానికి చెందిన యుగందర్-రాధిక దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారిద్దిరూ మంత్రాలు చేస్తున్నారంటూ అదే గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు, కృష్ణ కొంతకాలంగా వారిపై పగబట్టారు. దీంతో అదను చూసి మంగళవారం వారిద్దరిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలకు సీల్

అక్షర దర్బార్ వరంగల్ ప్రతినిధి: వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ కు సంబంధించిన పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్, వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలను ఎనుమాముల మార్కెట్ లోని స్ట్రాంగ్ రూమ్ లో సీల్ వేసి భద్రపరిచామని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. స్ట్రాంగ్ రూంలలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జార్వర్ బందారు స్వాగత్ రణ్వీర్ చంద్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సంబంధిత ఏఆర్ఓ లతో కలిసి స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచి సీల్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల వద్ద సీఆర్పీఎఫ్ సిబ్బందితో రౌండ్ ది క్లాక్ రెండంచెల భద్రత పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూంనకు సీల్ వేయడం జరిగిందని, ఎన్నికల కు సంబంధించిన పేపర్ మెటీరియల్ కు చెందిన స్క్రూటినీ రిపోర్ట్ లు, స్టాట్యుటరీ రిపోర్ట్ లు ఎన్నికల పరిశీలకుల సమక్షం లో సీల్ వేశామని అన్నారు. మంగళవారం ఎలక్షన్ పేపర్ స్ట్రాంగ్ రూం ను ఓపెన్ చేసి అబ్జార్వర్ అభ్యర్థుల తరఫున వచ్చిన ప్రజా ప్రతినిధుల సమక్షం లో స్క్రూటినీ చేయడం జరిగిందని వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధి లోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ లలో అతి ఎక్కువ అతి తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, రీప్లేస్మెంట్ జరిగిన బూత్ లు వంటి వాటిని స్క్రూటిని చేసి పరిశీలించడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సాఫీగా, విజయవంతం గా జరిగాయన్నారు. అన్ని గణాంకాలు సరిపోవడంతో ఎక్కడ కూడా రీ-పోలింగ్ కు అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రతి స్ట్రాంగ్ రూం కు ఒక గార్డ్ ఉంటారని, వారిచే లాగ్ బుక్ నిర్వహించబడుతుందని, స్ట్రాంగ్ రూం ఆవరణ లో ఎవరికి అనుమతి ఉండదని,అభ్యర్థులు వారి తరఫున వచ్చే ఏజెంట్ లకు ప్రత్యేక రూం ఏర్పాటు చేసి అక్కడ వరంగల్ పార్లమెంట్ కు చెందిన 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూం ల సీసీ పుటేజీ లను, స్క్రీన్ లు ఏర్పాటు చేసి ప్రదర్శించడం జరుగుతున్నదని తెలిపారు. అభ్యర్థులు వారి ఏజెంట్లు 24 గం.లు అట్టి పుటేజీ లను చూడవచ్చునని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఏఆర్ఓ లు అశ్విని తానాజీ వాఖడే, డిఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న సీపీ

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన సీపీ

పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఏనుమాముల మార్కెట్లో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత ఏర్పాట్లపై సీపీ పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష జరిపారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

వారణాసిలో మోడీ నామినేషన్

- హాజరైన అమిత్ షా, యోగి, చంద్రబాబు, పవన్ కళ్యాణ్

అక్షర దర్బార్, వారణాసి: ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం వారణాసిలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఎన్డీయే అగ్రనేతలు, పలు రాష్ట్రాల సీఎంలు పాల్గొన్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తదితరులు మోడీ వెంట రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. వారణాసిలో మోడీ హ్యాట్రిక్ సాధించడానికి బరిలో దిగుతున్నారు. నామినేషన్ దాఖలకు ముందు ప్రధాని వారణాసిలోని గంగా నది ఒడ్డున ఉన్న దశాశ్వమేధ ఘాట్లో పూజలు చేశారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య గంగమ్మ తల్లికి హారతి ఇచ్చారు. అనంతరం పర్యాటక బోటులో గంగానదీ విహారం చేశారు. కాలభైరవ ఆలయంలో పూజలు చేశారు. హ్యాట్రిక్ విజయం కోసం సోమవారం సాయంత్రం యోగితో కలిసి ప్రధాని ఆరు కిలోమీటర్ల మేర భారీ రోడ్‌షో నిర్వహించి, కాశీ విశ్వనాథుడి ఆలయంలో పూజలు చేశారు. రాత్రి వారణాసిలో బసచేసిన ప్రధాని మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఏడో విడతలో జూన్ ఒకటిన ఈ స్థానానికి పోలింగ్ జరగనుండగా, నామినేషన్ దాఖలు చేయడానికి గడువు మంగళవారంతో ముగిసింది. ఆయనకు పోటీగా కాంగ్రెస్ నుంచి యూపీ రాష్ట్ర పార్టీ శాఖ అధ్యక్షుడు అజయ్‌రాయ్ నిలబడిన సంగతి తెలిసిందే. ప్రధానిపై ఆయన పోటీ చేయడం ఇది వరుసగా మూడోసారి కావడం గమనార్హం. 2014లో ప్రధాని తొలిసారి ఇక్కడ పోటీ చేయగా, 56శాతం ఓట్లతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజయ్ రాయ్‌కి కేవలం 75వేల ఓట్లు దక్కాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ రెండో స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో ప్రధానికి 63 శాతం ఓట్లు రాగా అజయ్‌రాయ్‌కి 14శాతం ఓట్లు దక్కాయి. ఈసారి కూడా వారణాసి నుంచి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ శ్రేణులు ప్రధాని తరపున ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

కవిత కస్టడీ పొడిగింపు

అక్షర దర్బార్, ఢిల్లీ: లిక్కర్ స్కాంలో తిహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించారు. కోర్టు గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు మంగళవారంతో ముగియడంతో కవితను అధికారులు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో వర్చువల్గా హాజరు పరిచారు. దర్యాప్తు కొనసాగుతున్నందున రిమాండ్ పొడిగించాలని కోర్టును ఈడీ అధికారులు కోరారు. దర్యాప్తు సంస్థ విజ్ఞప్తి మేరకు ఈనెల 20 వరకు కస్టడీ పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. లిక్కర్ స్కాం కేసులో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్ను పరిగణలోకి తీసుకునే అంశంపై రౌస్ అవెన్యూ కోర్టు విచారించింది. 8 వేల పేజీల సప్లిమెంటరీ ఛార్జిషీట్ను ఈడీ దాఖలు చేసినట్లు తెలిపింది. దీన్ని పరిగణలో తీసుకునే అంశంపై ఈ నెల 20న విచారణ చేస్తామని పేర్కొంది. న్యాయమూర్తి కావేరీ బవేజా సోమవారమే దీనిపై విచారణ చేపట్టాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల మంగళవారానికి వాయిదా వేశారు. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్లో గోవా ఆప్ అసెంబ్లీ ప్రచార వ్యవహారాలు చూసిన చారియట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులు దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చన్‌ప్రీత్ సింగ్‌తోపాటు, ఇండియా ఎహెడ్ వార్తా ఛానల్ మాజీ ఉద్యోగి అర్వింద్‌సింగ్‌లనూ నిందితులుగా చేర్చింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితను మార్చి 15న ఈడీ అరెస్ట్ చేసింది. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ఆమెను తీహార్ జైల్లో ఉంచారు. జ్యుడీషియల్ ఖైదీగా ఉన్న సమయంలోనే ఏప్రిల్ 11న సీబీఐ ఆమెను అరెస్ట్ చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో కవితకు ప్రస్తుతం రిమాండ్ కొనసాగుతున్నది. కేసు విచారణ జరుగుతున్నందున ఆమె బయట ఉంటే సాక్ష్యాలను తప్పుదోవపెట్టే అవకాశం ఉంటుంది కాబట్టి కస్టడీని పొడిగించాలని, బెయిల్ ఇవొద్దంటూ ఈడీ పిటిషన్లు వేస్తూ వచ్చింది. ఈ క్రమంలో న్యాయస్థానం కూడా ఈడీ అధికారుల వాదనలతో ఏకీభవిస్తూ కస్టడీని కూడా పొడిగిస్తూ వస్తోంది. ఈ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్కు ఇటీవలే సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది.

అందరి సహకారంతో

ప్రశాంతంగా పోలింగ్

- **వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో 68.86 శాతం ఓటింగ్ నమోదు**
- **రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య**

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 68.86 శాతం పోలింగ్ నమోదైందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. మొత్తం 18,24,466 మంది ఓటర్లకు గాను 12,56,301 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఓటింగ్ లో పాల్గొన్న వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 6,29,512 ఉండగా, పురుష ఓటర్లు 6,26,704 మంది, ఇతరులు 85 మంది ఓటు వేశారని అన్నారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్ ను పరిశీలిస్తే, స్టేషన్ ఘనపూర్ లో మొత్తం 2,54,110 మంది ఓటర్లకు గాను 2,00,158 ఓటర్లు (78.77 శాతం), పాలకుర్తి లో 2,55,524 మంది ఓటర్లకు గాను 1,82,515 ఓటర్లు (71.43 శాతం), పరకాల లో 2,22,383 మంది ఓటర్లకు గాను 1,70,916 ఓటర్లు (76.86 శాతం), వరంగల్ పశ్చిమ లో 2,83,446 మంది ఓటర్లకు గాను 1,49,320 ఓటర్లు (52.68 శాతం), వరంగల్ తూర్పు లో 2,58,495 మంది ఓటర్లకు గాను 1,68,234 ఓటర్లు (65.08 శాతం), వర్ధన్నపేట లో 2,73,766 మంది ఓటర్లకు గాను 1,97,763 ఓటర్లు (72.24 శాతం), భూపాలపల్లి అసంబ్లీ సెగ్మెంట్ లో 2,76,752 మంది ఓటర్లకు గాను 1,87,395 ఓటర్లు (67.71 శాతం) తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని కలెక్టర్ వివరించారు. అందరి సహకారంతో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియ సక్రమంగా, సజావుగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన ఓటర్లకు, ప్రజలకు భాగస్వాములైన అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడం లో సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఎన్నికల సమాచారం ఎప్పటికపుడు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.

పోలింగ్ సరళిపై

పోస్టుమార్టం

- గెలుపోటములపై లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు
- బూత్ ల వారీగా కూడికలు, తీసివేతలు
- గెలుపుపై జోరుగా బెట్టింగ్
- ఫలితాలు వెలువడే వరకు ఉత్కంఠే..

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: మండుటెండలో జోరుగా ప్రచారం చేసిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల పై పోస్టుమార్టం చేస్తున్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పరిశీలన మొదలుపెట్టారు. ఏ శాసనసభ నియోజకవర్గంలో ఎంత పోలింగ్ నమోదైంది, పోలింగ్ శాతం తమకు అనుకూలమా, ప్రతికూలమా అని బేరీజు వేసుకుంటున్నారు. ఆయా సెగ్మెంట్ ముఖ్యనేతలతో చర్చలు జరుపుతున్నారు. ఏ బూతులో ఎంత ఓటింగ్ శాతం నమోదైంది ఆ బూత పరిధిలో తమ బలాబలాలు ఏంటని లెక్కలేసుకుంటున్న పరిస్థితి. బరిలో నిలిచిన వారు ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో నువ్వా నేనా అన్నట్లు పోటీ ఉండటంతో లోతుగా విశ్లేషిస్తున్నారు. ఏ ప్రాంతంలో ఎలా క్యాంపెన్ చేశాము, ప్రత్యర్థులు ఎలా ప్రచారం నిర్వహించారో చర్చించుకుంటూ కూడికలు తీసివేతలు చేసుకుంటున్నారు. ప్రచారంలో ఎంత ఖర్చు చేశాము, ఎక్కడెక్కడ ఎంత వ్యయం అయిందో లెక్కలు చూసుకునే బిజీలో నేతలు ఉన్నారు.

సైలెంట్ ఓటింగ్ పై ఎవరి ధీమా వారిది

సోమవారం జరిగిన లోకసభ ఎన్నికల్లో అత్యధిక పార్లమెంటు నియోజకవర్గాల్లో సైలెంట్ ఓటింగ్ జరిగింది. వీరి ఓట్లు ఎవరికి పడ్డాయో అర్థం చేసుకునే పనిలో అభ్యర్థులు మునిగితేలారు. వీరి ఓటింగ్ సరళిని పసిగట్టడంలో చాలా వరకు ఎవరి అంచాల్లో వారు ఉన్నారు. సైలెంట్ ఓటింగ్ తమకే అనుకూలిస్తుందని ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. వీరు ఫలితాన్ని కచ్చితంగా ప్రభావితం చేస్తారనేది మాత్రం అన్నీ రాజకీయ పార్టీలు దాదాపుగా అంగీకరిస్తున్నాయి.

కాయ్ రాజా కాయ్

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ దేశంలో జోరుగా సాగుతుండగా.. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలోనూ జోరుగా బెట్టింగ్ జరుగుతోంది. ఏ పార్టీ గెలుస్తుంది, ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తాడు, ఓడుతాడు అని పందెం కాస్తున్నారు. నలుగురు ఒకచోట చేరారంటే రాజకీయాలపైనే చర్చ జరుగుతోంది. రాజకీయ వర్గాల కన్నా సామన్యులు ఎన్నికలపై విస్తృతంగా చర్చలు జరుపుతున్నారు. ప్రధానంగా వయసుపైబడిన వారు లోతుగా విశ్లేషిస్తున్నారు.